సాక్షి నంద్యాల
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



రూ. లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కె.ఫణిప్రసాద్ శనివారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



మద్దిలేటయ్యకు వెండి హారం

బేతంచెర్ల: మద్దిలేటయ్య క్షేత్రంలోని స్వామి అమ్మవార్లకు కర్నూలుకు చెందిన చంద్రశేఖర్, రాజేశ్వరీ దంపతులు రూ.1.20 లక్షల విలువైన వెండి హారం, పాదాలను బహూకరించారు.



ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

ఆలూరు రూరల్: ఆలూరు పట్టణంలో శనివారం తెల్లవారు జామున జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ ఇంట్లోకి లారీ దూసుకెళ్లింది. క్లీనర్, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

తెలుగుగంగకు మహర్దశ

- ప్రధాన కాల్వ మరమ్మతులకు రూ. 20 కోట్ల కేటాయింపు
- లైనింగ్, పూడికతీత, కల్వర్టుల మరమ్మతులు
- 125 పనులకు అనుమతి
- త్వరలో పనులు ప్రారంభించేందుకు అధికారుల కసరత్తు



అహోబిలం సమీపంలో దెబ్బతిన్న తెలుగుగంగ ప్రధాన కాల్వ

ఆళ్లగడ్డ: గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన తెలుగుగంగ ప్రధాన కాల్వ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం నెలకొంది. దాదాపు పదేళ్లుగా ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించక కాల్వ ఎక్కడికక్కడ లైనింగ్ దెబ్బతిని, పూడిక పేరుకుపోయి నీరు పారేందుకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రధాన కాల్వ 58 కి.మీ నుంచి 96 కి.మీ వరకు 125 పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. ఆయా పనులకు సంబంధించి అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి ఆమోదం పొందారు. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు మొదలు పెట్టనున్నారు. నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ కాలువ నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, శిరివెళ్ల, రుద్రవరం, చాగలమర్రి, మహానంది, నంద్యాల, వెలుగోడు మండలాలతో పాటు వైఎస్సార్ జిల్లాలోని అనేక మండలాలకు సాగు, తాగు నీరు అందిస్తోంది. 1984లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చెన్నైకి తాగునీటి అవసరాలకు కృష్ణా జలాలను తరలించే ఒప్పందంలో భాగంగా తెలుగుగంగ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అనంతరం చంద్రబాబు నాయుడు పాలనలో పనులు నిలిచిపోయాయి. అనంతరం వైఎస్సార్ అధికారంలోకి రావడం జలయజ్ఞంలో భాగంగా తెలుగుగంగ పనులు పూర్తి చేయించి ఆయకట్టును సస్యశ్యామలం చేశారు. ఆతర్వాత పాలకులు పదేళ్లు తెలుగు గంగ ఊసే ఎత్తలేదు. మరమ్మతులు లేక ప్రధాన కాల్వలు, డైవర్షన్ చానళ్లు, డిస్ట్రిబ్యూటరీ కాల్వల పరిస్థితి దయనీయంగా మారింది. సమస్యను అధికారులు స్థానిక ఎమ్మెల్యేల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 20 కోట్లు కేటాయించారు. ముందుగా రూ. 4 కోట్లతో ప్రధాన కాలువ 58 కి.మీ నుంచి 96.130 వరకు 26 పనులు, 21వ బ్లాక్ నుంచి 37వ బ్లాక్ వరకు 66 పనులు చేపట్టేందుకు రూ. 10 కోట్లు, మరో 22 పనులకు రూ. 3 కోట్లు ఖర్చు చేయనున్నారు.



శిథిలమైన 26 బ్లాక్ డిస్ట్రిబ్యూటరీ కాల్వ

చివరి ఆయకట్టుకు నీరు..

తెలుగుగంగ ప్రాజెక్ట్ పరిధిలోని ఆయకట్టు కింద జిల్లాలో 1,14,500 ఎకరాలు ఉంటే అందులో ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల పరిధిలో 83 వేల ఎకరాలకు పైగా ఉంది. నియోజకవర్గంలోని 45 చెరువులు, 18 కుంటలను కూడా తెలుగుగంగ నీటితో నింపి వేసవిలో అనేక గ్రామాల్లో సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలి. కాగా దశాబ్దాల కాలంగా ఎటువంటి మరమ్మతులు లేకపోవడంతో డిస్ట్రిబ్యూటరీ చానళ్లపై నిర్మించిన కల్వర్టులు కుంగిపోవడం, లైనింగ్ దెబ్బతినడం, కాల్వ లోపల, బయట ముళ్ల పొదలు పెరగడం, పలు చోట్ల కోతకు గురికావడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో కాల్వ మరమ్మతులు పూర్తయితే మొక్కజొన్న, పత్తి, వరి సాగు చేసే ఆయకట్టు రైతుల సాగునీటి సమస్య పరిష్కారం కానుంది.

జిల్లాలో తెలుగుగంగ ఆయకట్టు సాగు ఇలా

మండలం	డిస్ట్రిబ్యూటరీ చానళ్లు..	ఆయకట్టు ఎకరాల్లో
వెలుగోడు	1 నుంచి 2	15,798
బండిఆత్మకూరు	3 నుంచి 8	18,838
మహానంది,	9 నుంచి 12	8,435
శిరివెళ్ల	13 నుంచి 15	15,983
రుద్రవరం	16 నుంచి 21	31,455
ఆళ్లగడ్డ	22 నుంచి 28	18,476
చాగలమర్రి	29 నుంచి 37	12,015

పదేళ్ల సమస్య తీరనుంది



నాకు 21వ బ్లాక్ కింద మొదట్లోనే ఆరు ఎకరాల పొలం ఉంది. డైవర్షన్ కాలువ తో పాటు దానిపై ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలమై పోయింది. దీంతో నీరు మొత్తం కిందకు పోతూ పైకి ఎక్కడం లేదు. నీరు పెట్టుకోవాలంటే మట్టి సంచులు అడ్డం వేసి రాత్రిళ్లు అవి కొట్టుకుపోకుండా జాగరణ చేయాలి. పదేళ్లుగా చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు మరమ్మతులు చేస్తామని అధికారులు వచ్చి పరిశీలిస్తున్నారు. పనులు పూర్తయితే పదేళ్ల సమస్య తీరనుంది.

– మోహన్‌రెడ్డి, రైతు, టి లింగందిన్నె

సీఎంకు రుణపడి ఉంటాం



చెంతనే రిజర్వాయరు, ప్రధాన కాల్వ ఉన్నా మా పొలానికి సక్రమంగా నీరు అందక చాలా ఇబ్బందులు పడుతున్నాం. గత పదేళ్లుగా చెబుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. పక్కనే నీరున్నా పంటలు పండించుకోలేని పరిస్థితి మాది. ఇప్పుడు మరమ్మతులు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తయితే ఇక రెండు పంటలకు పుష్కలంగా నీరందుతుంది. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– నరసింహారెడ్డి, రైతు, డి. కొట్టాల

పుష్కలంగా నీరు



తెలుగుగంగ కాల్వకు మరమ్మతులు చేపట్టక పదేళ్లు అయింది. ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి చొరవతో కాల్వ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతానికి 125 మరమ్మతుల పనులు చేపట్టేందుకు అనుమతులు ఇచ్చింది. త్వరలో టెండర్లు పిలిచి ఖరీఫ్ మొదలయ్యే సరికి పూర్తి చేసి సాగునీరు అందిస్తాం.


– శివశంకర్‌రెడ్డి, ఈఈ, తెలుగుగంగ ప్రాజెక్ట్

ఇన్విజిలేటర్ ఫోన్‌లో డేటా మాయం!

- డీఎంఈ, రిజిస్ట్రార్‌లకు అధికారుల నివేదిక

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో నిర్వహించిన ఎంబీబీఎస్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఇన్విజిలేటర్ డాక్టర్ చక్రపాణియాదవ్‌పై కమిటీ అధికారులు విచారణ జరిపి నివేదికను డీఎంఈ, వర్సిటీ రిజిస్ట్రార్‌లకు పంపించారు. కాగా శుక్రవారం డాక్టర్ చక్రపాణియాదవ్‌ను కమిటీ సభ్యులు పిలిపించి విచారణ చేశారు. ఈ మేరకు అప్పటికే సీజ్‌లో ఉన్న సెల్‌ఫోన్‌ను ఆయనతోనే ఓపెన్ చేయించగా అందులో డేటా మాయం అయినట్లు అధికారులు గుర్తించారు. తాను తప్పు చేసినట్లు దొరకకూడదన్న ఉద్దేశంతో ఇన్విజిలేటరే ఆన్‌లైన్ ద్వారా సెల్‌ఫోన్‌లోని డేటాను డిలీట్ చేసి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించారు. సెల్‌ఫోన్‌లో ఏమీ లేదని, తానేమీ ఫొటోలు తీయలేదని కమిటీ ముందు ఇన్విజిలేటర్ చెప్పినట్లు సమాచారం. డేటా ఎందుకు డిలీట్ అయ్యిందన్న ప్రశ్నకు మౌనమే సమాధానమైనట్లు తెలిసింది.

జిల్లాలో తేలికపాటి వర్షాలు



పాములపాడులో జలమయమైన రహదారి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలుచోట్ల శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు తేలికపాటి వర్షాలు కురిశాయి. మంత్రాలయంలో 37.4, కౌతాళంలో 18.2, కోసిగిలో 13.6, ఆస్పరిలో 11.8, దేవనకొండలో 9.4, తుగ్గలిలో 7.4, ఆదోనిలో 6.6, పత్తికొండలో 6.4 , జూపాడుబంగ్లాలో 42.8, నందికొట్కూరులో 29.4, పగిడ్యాలలో 26.4, పాములపాడులో 24.6, ప్యాపిలిలో 22.2, డోన్‌లో 19.6, కొలిమిగుండ్లలో 17.2 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. శనివారం సాయంత్రం నుంచి కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. కర్నూలులో గరిష్టంగా 35.6 డిగ్రీలు, కనిష్టంగా 23.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వర్షాలు పడుతుండటంతో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఏర్పడింది.

న్యూస్‌రీల్

పీఎంశ్రీకి 28 పాఠశాలల ఎంపిక

నంద్యాల(సిటీ): జిల్లాలో 28 పాఠశాలలు ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)కి ఎంపికైనట్లు డీఈఓ అనురాధ శనివారం తెలిపారు. స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పీఎంశ్రీ కింద జిల్లా నుంచి 69 పాఠశాలల ప్రతిపాదనలు పంపగా 28 ఎంపిక అయ్యాయన్నారు. ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బడ్జెట్, కాస్టింగ్ షీట్‌ను ఏ విధంగా అప్లోడ్ చేయాలనే వివరాలపై అవగాహన కల్పించామన్నారు. పాఠశాలలకు ప్రత్యేక నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. కార్యక్రమంలో సమగ్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలితకుమారి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి, అలెస్కో (ఆల్టర్‌నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్) రఘురామిరెడ్డి, అసిస్టెంట్ అకడమిక్ మానటిరింగ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఈఓ, చైర్మన్లు

మహానంది: మహానంది క్షేత్రంలో జూన్ నెలలో కుంభాభిషేకం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం కార్యాలయంలో వేదపండితులు, అర్చకులతో సమావేశం నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కంచికామకోటి పీఠాధిపతి, జగద్గురువు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో కుంభాభిషేకం నిర్వహించేందుకు పండితులు, అర్చకులతో చర్చించామన్నారు. అలాగే ఒరిగిన గర్భాలయ కలశం స్థానంలో నూతన కలశం ప్రతిష్ఠించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, వేదపండితులు రవిశంకర అవధాని, ముఖ్య అర్చకులు రాజారత్తయ్యబాబు, మూలస్థానం శివశంకర శర్మ, రాజమాణిక్యశర్మ, వనిపెంట ప్రకాశం శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వెంకటరమణకు లడ్డుప్రసాదాలను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పాల వెంకటరమణ దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వారు స్వామివారికి రుద్రాభిషేకం అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేద పండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డుప్రసాదాలు అందజేశారు.

ముగిసిన మూల్యాంకనం

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల మూల్యాంకనం శనివారం పూర్తయినట్లు డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి తెలిపారు. జిల్లాకు మొత్తం 21 వేల సమాధాన పత్రాలు వచ్చాయని, నిర్దేశిత సమయానికి మూల్యాంకనం పూర్తి చేశామని పేర్కొన్నారు.

మెగా పీపుల్స్ సర్వేలో నంద్యాల టాప్

- ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకే
- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి

నంద్యాల(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మెగా పీపుల్స్ సర్వే ఫలితాల్లో నంద్యాల పార్లమెంట్ సెగ్మెంట్ ప్రథమ స్థానంలో, నంద్యాల అసెంబ్లీ 9వ స్థానంలో నిలిచిందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి వివరించారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాతో కలిసి పీపుల్స్ సర్వే వివరాలను వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ ఏప్రిల్ 7వ తేదీ నుంచి ఈనెల 29 వరకు వైఎస్సార్ సీపీకి చెందిన గృహ సారథులు, కన్వీనర్లు మెగా పీపుల్స్ సర్వేను విజయవంతం చేశారన్నారు. ప్రజల కోసం, వారి పిల్లల భవిష్యత్తు కోసం జగనన్నను విశ్వసిస్తున్నామని సర్వేలో ప్రజలు స్పందించారన్నారు. ప్రజల నుంచి వచ్చిన మద్దతు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం, పరిపాలనపై విశ్వసనీయతకు సాక్ష్యంగా నిలిచిందన్నారు. ఈ సర్వేతో ప్రతిపక్షాలకు షాక్ కొట్టినట్లు అయ్యిందని, వారు తమ కంచుకోటలని భావించిన ప్రాంతాల్లో కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ క్షేత్రస్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నిబద్ధతగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మెగా పీపుల్స్ సర్వేను నిర్వహించారన్నారు. ఇలాంటి సర్వే దేశంలో ఏ రాజకీయ పార్టీ చేపట్టలేదని, అతిపెద్ద పబ్లిక్ సర్వేగా 'జగనన్నే మా భవిష్యత్తు సర్వే' నిలిచిందన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వారి భవిష్యత్తు కోసం జగనన్ను మాత్రమే విశ్వసిస్తామని చెప్పడానికి ఇదే సాక్ష్యమన్నారు. జగనన్న ప్రభుత్వం అవినీతి రహిత, మధ్యవర్తులు లేని సంక్షేమ, అభివృద్ధి అందిస్తున్న ప్రభుత్వమని అందరూ నమ్ముతున్నారన్నారు. దీనికి కారణం సీఎం జగనన్న ప్రవేశపెట్టిన అనేక సంస్కరణలేనన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కన్వీనర్లు సలాముల్లా, రాజశేఖర్‌రెడ్డి, బసవేశ్వర రెడ్డి, నందం బాబురావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సమ్మోహనం.. మోహిని అలంకారం



మోహిని అలంకారంలో జ్వాల నరసింహస్వామి

ఆళ్లగడ్డ: శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. శనివారం శ్రీ జ్వాల నరసింహస్వామి మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజల అనంతరం ఉత్సవమూర్తులు శ్రీజ్వాల నరసింహస్వామి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను యాగశాలలో కొలువుంచి నవకలశ స్థాపన, అర్చన, అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం శ్రీ జ్వాల నరసింహస్వామిని మోహిని అలంకారంలో అలంకరించి ఉత్సవ పల్లకీలో కొలువుంచి మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె. సాగరిక

ఎమ్మిగనూరు రూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం నిర్వహించిన నవదోయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణకు కర్నూలు, నంద్యాల జిల్లాలో 22 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 7,767 మంది విద్యార్థులకు గాను 6,868 మంది హాజరయ్యారు. ఆయా కేంద్రాలకు విద్యార్థులు అర గంట ముందుగానే చేరుకున్నారు. అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఎటువంటి ఆటంకం లేకుండా పరీక్ష రాశారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



ఎస్.నాగులవరంలో జగనన్న కాలనీలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

గోస్పాడు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎస్.నాగులవరం, జూలేపల్లె గ్రామాల్లోని జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో రోడ్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం గోస్పాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎన్‌సీడీ సీడీ సర్వే సక్రమంగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. మాతాశిశు మరణాలు జరగకుండా గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య విధానంపై సరైన అవగాహన కల్పించి వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని సూచించారు.

ఏడు నెలల బాలుడి కిడ్నాప్



రాము (ఫైల్)

మంత్రాలయం: తుంగభద్ర పాత రైల్వేస్టేషన్ ముఖద్వారంలో అమ్మనాన్నతో నిద్రిస్తున్న 7 నెలల బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాలుడి కిడ్నాప్‌పై రైల్వే పోలీస్ బృందం విచారణ చేపట్టింది. వివరాలివి.. మంత్రాలయం మండలం కాచాపురం గ్రామానికి చెందిన అంజి, అంకమ్మ రోజు మాదిరి శుక్రవారం రాత్రి తుంగభద్ర పాత రైల్వేస్టేషన్‌లో నిద్రించారు. వేకువజామున 4 గంటల ప్రాంతంలో చిన్నారి రాము కనిపించలేదు. తల్లిదండ్రులు ఆందోళనతో రైల్వే స్టేషన్ ప్రాంతం, గ్రామంలో గాలించారు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడు కిడ్నాప్ గురయ్యాడని పోలీసులు విచారణ చేపట్టారు.

4న ఆరోగ్య శాఖ మంత్రి రాక

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మే నెల 4వ తేదీన ఉమ్మడి జిల్లాకు రానున్నారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు ఆమె నంద్యాలలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వాసుపత్రిని సందర్శించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని రేడియో డయాగ్నస్టిక్ బ్లాక్, పీజీ, యూజీ గర్ల్స్ హాస్టళ్లను ప్రారంభించనున్నారు. ఆసుపత్రిలో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ సెంటర్‌ను సందర్శించనున్నారు. ఆ తర్వాత కర్నూలు ప్రభుత్వాసుపత్రిని సందర్శిస్తారు. అక్కడే ఆరోగ్య శాఖ ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహిస్తారు. అనంతరం ప్రొఫెసర్లు, హెచ్‌ఓడీలతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్‌డీఆర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపీ పోచా

నంద్యాల(సిటీ): జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్స్ రెండో దశలో ఎస్‌డీఆర్ ఆకాంక్ష విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారని కళాశాల చైర్మన్ కొండారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానాన్ని సాధించాలంటే విద్య పట్ల మక్కువతో ముందుకు సాగాలని సూచించారు. ఆత్మస్థైర్యం, ఒత్తిడి లేకుండా చదివితే విజయం వరిస్తుందన్నారు. అనంతరం ఆలిండియా 93వ ర్యాంకు సాధించిన యశ్విత రెడ్డి, 977వ ర్యాంకు సాధించిన వసంత్‌కుమార్, 3,507 ర్యాంకు సాధించిన లక్ష్మీప్రియతో పాటు పది మందికి పైగా 10వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యాసంస్థల చైర్మన్ వెంకటరామిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అకౌంటెంట్ కమ్ మేనేజర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏ - వైకేపీలో అంతర్భాగమైన జిల్లా సమాఖ్య కార్యాలయంలో అకౌంటెంట్ కమ్ మేనేజర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సీతాబాయి తెలిపారు. బీకాం, బీబీఏ, ఎంకామ్, ఎంబీఏ(ఫైనాన్స్) పూర్తి చేసిన వారు అర్హులని ఆమె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. మే 3వ తేదీ లోగా దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

విద్యార్థి పేరు: ఆర్.హర్షవర్ధన్
పర్సంటైల్: 99.98
స్వస్థలం: డోన్
తల్లిదండ్రులు: రవిశంకర్, శ్రీలక్ష్మి
లక్ష్యం: ముంబై ఐఐటీలో సీఎస్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం



విద్యార్థి పేరు: ఎస్.రాహీల్
పర్సంటైల్: 99.16
తండ్రి: హుసేన్ బాషా
స్వస్థలం: నంద్యాల
లక్ష్యం: బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ చదివి, ఐపీఎస్ కావడం



పేరు:జయసాయి
పర్సంటైల్: 99.35
తల్లిదండ్రులు: బి.శేషప్ప, అంజలిదేవి
స్వస్థలం: కర్నూలు
లక్ష్యం: కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించడం



జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు!

- జిల్లా విద్యార్థికి అత్యధికంగా 99.98 పర్సెంటైల్

కర్నూలు సిటీ: దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీ, ఎన్‌ఐటీ విద్యా సంస్థల్లోని ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన హర్షవర్ధన్ 99.98 పర్సెంటైల్ సాధించారు. అదే విధంగా విజయ తేజశ్విని 99.52, బి.జయసాయి 99.35, జె.పవన్ కుమార్ రెడ్డి 99.39, షారూక్ 99.30, అనుగ్య 99.21, ఎస్.రాహిల్ 99.16 పర్సెంటైల్ సాధించారు. ఈ నెల7 నుంచి 15వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలోని కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షను నిర్వహించారు. తుదికీ ని ఇటీవల విడుదల చేసిన ఎన్‌టీఏ మొదటగా పేపర్-1(బీఈ/బీటెక్)పరీక్ష ఫలితాలను విడుదల చేసి ఉత్తీర్ణులైన వారి పర్సెంటైల్‌ను ప్రకటించింది.

గురుకుల అకాడమీ విద్యార్థుల ప్రతిభ: కల్లూరు మండలం చిన్నటేకూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ-మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఉత్తమ పర్సెంటైల్ సాధించినట్లు ఆ అకాడమీ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2021-23 సంవత్సరానికి శిక్షణ పొందిన 55 మంది విద్యార్థుల్లో 45 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో చిన్నలింగప్పగారి ప్రవీణ్ క్యాటగిరి ర్యాంకు 1,705, గౌతమి నాయక్ 1,708, ఎం.అవన్‌కుమార్ 1,766వ, ఆర్.కిరణ్‌కుమార్ 1,813 , లోకేష్ నాయక్ 2,378, వై.తరుణ్ 3,860, సాకేటి కృపారావు 4,272వ, రెడ్డిపోగు రాజు 4,717, జంగం విద్యాసాగర్ 4,727, రమేష్ నాయక్ 5,532 ర్యాంకు సాధించినట్లు చెప్పారు. వీరితో పాటు మరి కొంత ఉత్తమ పర్సెంటైల్ సాధించారన్నారు.

పేరు: ప్రవీణ్
క్యాటగిరీ ర్యాంకు: 1,705
కళాశాల:చిన్నటేకూరు గురుకుల అకాడమీ
స్వస్థలం: అనంతపురం
తల్లిదండ్రులు: చంద్రకళ, తిప్పేస్వామి
లక్ష్యం: సివిల్ ఇంజినీర్ కావడం



పేరు: అవన్‌కుమార్
క్యాటగిరీ ర్యాంకు: 1,766
స్వస్థలం: నంద్యాల
తల్లిదండ్రులు: లక్ష్మీదేవి, రామాంజనేయులు
లక్ష్యం: ఎలక్ట్రికల్ ఇంజినీర్ కావడం



పేరు: కిరణ్‌కుమార్
క్యాటగిరీ ర్యాంకు: 1,813
కళాశాల: చిన్నటేకూరు గురుకుల అకాడమీ
స్వస్థలం: విజయనగరం
తల్లిదండ్రులు: ఆదిలక్ష్మి, చిన్నరావు
లక్ష్యం: ఏరోనాటికల్ ఇంజినీర్ కావడం



ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు తరగతులు

నంద్యాల(సిటీ): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీవీఈఓ (డిస్ట్రిక్ట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్) సునీత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 1వ నుంచి 20వ తేదీ వరకు, ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తామని, సమీపంలో ఉన్న కళాశాలకు విద్యార్థులు వెళ్లవచ్చునని పేర్కొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

కర్నూలు: ట్రాఫిక్ కోర్టు కానిస్టేబుల్ ఎస్.ప్రకాష్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి విధించిన జరిమానా కంటే రెట్టింపు డబ్బులు వసూలు చేస్తున్నట్లు కొంతకాలంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. తాజాగా కర్నూలు నగరానికి చెందిన షేక్ షమీర్ అనే వ్యక్తికి న్యాయమూర్తి రూ.వెయ్యి జరిమానా విధించగా కానిస్టేబుల్ ప్రకాష్ రూ.3500 వసూలు చేశాడని, ఇదేమిటని నిలదీయగా తనను బెదిరిస్తున్నాడంటూ రాతపూర్వకంగా ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణంకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపించగా అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు బయటపడింది. దీంతో ఎస్పీ కృష్ణకాంత్.. కోర్టు కానిస్టేబుల్ ప్రకాష్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈయన 2003లో పోలీసు శాఖలో విధుల్లో చేరాడు. నాలుగేళ్లుగా ట్రాఫిక్ విభాగంలో కోర్టు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.